
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
5 జిల్లా వార్తలు
ఆదివారం 29 జూన్ 2025

కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీలు

కరీంనగర్ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలోని పలువురు ఏసీపీలు బదిలీ అయ్యారు. కరీంనగర్ సీసీఆర్‌బీ ఏసీపీగా పోస్టింగ్ కోసం డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సీహెచ్ శ్రీనివాస్‌జీని నియమించారు. సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న జి విజయ్‌కుమార్‌ను యాదగిరిగుట్ట ఏసీపీగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎస్పీ వి సతీష్‌ను కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, డీఎస్పీ జె నర్సింహులును కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా నియమించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీగా పనిచేస్తున్న శుభం ప్రకాశ్(ఐపీఎస్) వరంగల్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.





రైతుల ఖాతాల్లో రూ.206.64 కోట్లు



- భరోసా సాయంపై అన్నదాతల్లో ఆనందం
- ఈ విడత ముగిసినట్లేనా..?
- వివరాలు ఇచ్చినా 6,829 మందికి అందని సాయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వానాకాలం సాగుకు రైతు భరోసా సాయం సకాలంలో అందడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం ఈ నెల 24న సచివాల యంలో రైతు భరోసా విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు రైతులను ఉద్దేశించి మాటా ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికల్లో దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా రైతులు ఆ కార్యక్ర మాన్ని వీక్షించారు. దీంతో ఈ కార్యక్రమం ఈ విడతకు పూర్తయినట్లేననే అభిప్రాయం వ్యక్తమవు తున్నది. జిల్లాలో 1,90,195 మంది రైతులకు 206.64 కోట్ల రూపాయలు అందాయి. జిల్లాలో 1,90,606 మంది రైతుల ఖాతాల్లో 207,12,04,857 రూపా యలు జమ చేశారు. 411 మంది రైతులకు వారి వారి బ్యాంకు ఖాతాలు, ఇతర సమస్యల కారణంగా జమ చేసిన డబ్బు వారి ఖాతాల్లో చేరలేదు. దీంతో 47,78,114 రూపాయలు ఆ రైతులకు అందలేదు. ఈ సీజన్‌లో 2,10,904 మంది రైతులకు 211,90,69,841 రూపాయలు రైతు భరోసా సాయంగా అందించాల్సి ఉందని గుర్తించారు. కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు వారి పట్టాదారు పుస్తకాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర సమాచారం వ్యవ సాయ అధికారులకు అందించాలని కోరారు. ఆయా రైతులు అందించిన సమాచారం మేరకు 1,97,524 మంది రైతుల ఖాతాలను మండల వ్యవ సాయ అధికారులు పరిశీలించి వారి వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. 1,90,606 మంది రైతులకు మాత్రమే డబ్బు ట్రెజరీకి పంపించారు. వివరాలు అప్‌లోడ్ చేసిన రైతుల్లో ఇంకా 6,828 మందికి రైతు భరోసా సాయాన్ని పంపించాల్సి ఉన్నది. విజయోత్సవ సభ అయిన రోజు నుంచి కొత్తగా రైతుల ఖాతాల్లో జమ చేయడానికి ట్రెజరీకి డబ్బు పంపించినట్లు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు. దీంతో ఆ రైతులకు ఈ సీజన్‌కు డబ్బు వస్తుందా, రాదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వచ్చే సోమ, మంగళవారాల్లో బ్యాంకు ఖాతాలకు డబ్బు రాని పక్షంలో ఈ సీజన్‌కు ఇక ఇంతే కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

● మానకొండూర్ మండలంలో అత్యధికం

జిల్లాలో అత్యధికంగా మానకొండూర్ మండలంలో 20,146 మంది రైతులకు 21.86 కోట్ల రూపాయలు రైతు భరోసా సాయంగా అందింది. అత్యల్పంగా కరీంనగర్ అర్బన్ మండలంలో 12 మంది రైతులు 1.58 లక్షల రూపాయలు పొందారు. ఈ విడతలో చొప్పదండి మండలంలో 13,317 మంది రైతులకు, గంగాధర మండలంలో 14,388, రామడుగు మండలంలో 13,902, ఇల్లందకుంట మండలంలో 10,707, హుజూరాబాద్ మండలంలో 13,672, జమ్మికుంట మండలంలో 12,398, సైదాపూర్‌లో 13,819, వీణవంకలో 14,557 మంది రైతులకు రైతు భరోసా సాయం అందింది. కరీంనగర్ రూరల్ మండలంలో 11,059 మంది రైతులకు, కొత్తపల్లి మండలంలో 7,043, చిగురుమామిడి మండలంలో 12,757, గన్నేరువరం మండలంలో 7,003, శంకరపట్నం మండలంలో 13,658, తిమ్మాపూర్ మండలంలో 11,757 మంది రైతులకు రైతు భరోసా సాయం అందింది.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

● ప్రత్యేకాధికారుల పాలనలో తప్పనితిప్పలు



బద్దిపల్లిలో డ్రైనేజీపై చెట్లు

భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మున్సిపాలిటీలో కార్పొరేటర్లు లేక పోవడంతో పారిశుధ్య సమస్యలతో ప్రజలు సతమవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్తా చెదారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లి మండలంలో ఎలగందల్, ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి కమాన్‌పూర్ గ్రామాలు, కరీంనగర్ నగర పాలక సంస్థలో విలీనమైన మల్కాపూర్, చింతకుట గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీ ఉన్నాయి. కొత్తపల్లి మున్సిపాలిటీ పాలక వర్గం గడువు ముగిసి పోవడంతో నగర పాలక సంస్థ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారు.

● విలీన గ్రామాల్లో అదే పరిస్థితి

నగర పాలక సంస్థలో విలీన మైన కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, చింతకుంట గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. విలీన గ్రామాలు నగర పాలక సంస్థలో విలీనంకావడం సరిపడా సిబ్బంది లేక పట్టించుకునే వారులేక పోవడంతో చెత్త చెదారం రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి.

స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- ఉప్పు రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల సమస్యలు అప్పటికప్పుడు పరిష్కారమవుతాయి. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు స్థానికప్రజా ప్రతినిధులు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది.



ఎలగందల్‌లో రోడ్డుపై వదిలేసిన మట్టి

అసంపూర్తి పనులు ముందుకు కదిలేనా?

- నెలల తరబడి ఇబ్బందులు పడుతున్న జనం
- వర్షాకాలం ప్రారంభమవడంతో ఇక్కట్లు షురూ

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివి జన్లలో పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన పలు రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయి. పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధులతో ఈ పనులు చేపట్టారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు నిలిచిపోయాయి. కొన్న చోట్ల పాత రోడ్లు, డ్రైనేజీలను కూల్చి వేశారు. పనులు ప్రారంభించి వాటిని సగంలోనే వదిలేశారు. మరి కొన్ని చోట్ల రోడ్లను, డ్రైనేజీలను తవ్వి అలాగే వదిలిపెట్టారు. దీంతో ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సీఎం హామీ నిధులను నిలిపివేసింది. గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వక పోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.



9వ డివిజన్‌లో తవ్వి వదిలిపెట్టిన డ్రైనేజీ

● ఇళ్లలోకి వాహనాలు వెళ్లలేని స్థితి

కాలనీల్లో రోడ్లను తవ్వి వదిలి వేయడంతో ఇళ్లలోకి వారి వాహనాలను తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. జ్యోతిబాపూలె మైదానం వెనుక ప్రాంతం రోడ్డులో తవ్వి వదిలి వేయడంతో గత యేడాది వర్షకాలంలో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విధంగా చాలా చోట్ల రోడ్లు తవ్వి వదిలి వేయడంతో వర్షాకాలంలో వరద నీరు నిలిచి బురదమయం కావడం, ఎండ కాలంలో దుమ్ముధూళి లేవడంతో ఆయా ప్రాంతాల వారే కాకుండా వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. చాలా చోట్ల ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో అసంపూర్తి పనులను పూర్తి చేయాలని ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



అశోక్‌నగర్‌లో రోడ్డు తవ్వి వదిలిపెట్టడంతో ఏర్పడిన బురదగుంటలు

● చిరు జల్లులకే బురదమయం

వర్షాకాలం ప్రారంభం కావడంతో చిరు జల్లులకే రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో రోడ్లపై మురికి కాలువల నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టి నగర ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలను నగర పాలక సంస్థలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నైనా పట్ట ప్రగతి నిధులతో ప్రారంభించి అసంపూర్తిగా వదిలివేసిన పనులను పూర్తి చేయాలని, సమస్యలను పరిష్కరించాలని నగర వాసులు కోరుతున్నారు.

చెక్‌డ్యాంలో పేరుకుపోయిన ఇసుక



చెక్ డ్యాంలో పేరుకుపోయిన ఇసుక

కరీంనగర్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వృథాగా పోతున్న నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం వాగులపై కరీంనగర్ నియోజవర్గంలో ఎనిమిది చెక్ డ్యాంలను నిర్మించింది. ఆయా చెక్ డ్యాంలలో ఇసుక పేరుకుపోవడంతో నీరు నిలువ ఉండడం లేదు. కరీంనగర్ మండలం నగునూర్‌లో ఆరు సంవత్సరాల క్రితం నగునూర్ పాత రోడ్డు నుంచి వాగుపై చెక్ డ్యాంను నిర్మించారు. 12.79 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ చెక్ డ్యాం ప్రస్తుతం నీరు లేక వెల వెల బోతుంది. గతంలో ఈ చెక్ డ్యాంలో భారీ ఎత్తున నీరు నిలిచేది. దీంతో భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగు నీటి ఇబ్బందులు తీరాయి. ప్రతి సంవత్సరం వచ్చే వరదలతో చెక్ డ్యాంలో ఇసుక పేరుకుపోయింది. దీంతో చెక్ డ్యాంలో నీరు నిలువ ఉండడం లేదు. చెక్ డ్యాంలో ఇసుక భారీగా పేరుకు పోవడం వల్ల నీరు నిలవడం లేదని, వెంటనే ఇసుకను, పూడిక తీసి నీరు నిలిచే విదంగా చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మారిన డివిజన్ల స్వరూపం

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు శివారు గ్రామాలను విలీనం చేయడంతో డివిజన్ల స్వరూపం పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66 డివిజన్లుగా మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం డివిజన్లలకు సంబంధించిన తుది జాబితాను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారంగా 66 డివిజన్లలో వచ్చే కాలనీల వివరాలిలా ఉన్నాయి.



● డివిజన్ నం.1లో ఆరెపల్లి, తీగలగుట్ట ఎల్లి (ఓటర్లు 4,874), 2లో తీగలగుట్టపల్లి (,5088), 3లో వల్లంపహాడ్, ఓల్డ్ తీగలగుట్ట ఎల్లి, విద్యార ణ్యపురి, తీగలగుట్టపల్లి, బుట్టిరా జారాంకాలని, అంబేద్కర్‌నగర్ (ఓటర్లు 5,249) వస్తాయి.

● డివిజన్ నం.4లో గోపాలపూర్, దుర్శేడ్ (ఓటర్లు 4,997), 5లో శ్రీపురం కాలనీ, రజ్వీచమన్, రాయల్‌హోం, చల్మెడ హాస్పిటల్, దుర్శేడ్ (ఓటర్లు 5,015), 6లో ఓల్డ్ బొమ్మకల్, ఆటోనగర్, గుంటూరుపల్లి (ఓటర్లు 4,920) ప్రాంతాలను చేర్చారు.

● డివిజన్ నం. 7లో హౌసింగ్‌బోర్డ్ కాలనీ, సదాశివపల్లి (ఓటర్లు 5,207), 8లో అల్గునూర్ (ఓటర్లు 5,697) ప్రాంతాలు వస్తాయి. డివిజన్ నం.9లో కోతిరాంపూర్, అలకాపురికాలనీ, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్ (ఓటర్లు 4,763), 10లో కట్టరాంపూర్, తిరుమలనగర్, గౌతమినగర్ (ఓటర్లు 5,078), 11లో కట్టరాంపూర్, గౌతమినగర్, రామచంద్రాపూర్‌కాలనీ (ఓటర్లు 5457), 12లో రామచంద్రాపూర్‌కాలనీ, హస్నాపూర్‌కాలనీ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్ (ఓటర్లు 5338), 13లో సప్తగిరికాలనీ, ప్రగతినగర్, శివనగర్, మార్కండేయనగర్ (ఓటర్లు 5339) ప్రాంతాలను చేర్చారు.

● డివిజన్ నం. 14లో చింతకుంట, గాంధీనగర్, పద్మనగర్ (ఓటర్లు 4,658), 15లో చింతకుంట (ఓటర్లు 5,174), 16లో మల్కాపూర్, లక్ష్మీపూర్ (ఓటర్లు 4,212) ప్రాంతాలు వస్తాయి.

● డివిజన్ నం. 17లో కొత్తపల్లి (5,427), 18లో కొత్తపల్లి (ఓటర్లు 5,245), 19లో రేకుర్తి (ఓటర్లు 5,166), 20లో రేకుర్తి (ఓటర్లు 5455) ప్రాతాలను చేర్చారు.

● డివిజన్ నం. 21లో కొత్త యాస్వాడ, రేకుర్తి (ఓటర్లు 5,326), 22లో కొత్త యాస్వాడ, హిందూపురికాలనీ, జగిత్యాలరోడ్, జ్యోతినగర్, చైతన్యపురి (ఓటర్లు 5,200) ప్రాంతాలు వస్తాయి.

● డివిజన్ నం. 23లో సీతారాంపూర్, మెహర్‌నగర్ (ఓటర్లు 4,786), 24 లో వావిలాలపల్లి, మెహర్‌నగర్, బ్యాంకుకాలనీ, సుభాష్‌నగర్ (ఓటర్లు 5,251), 25లో సుభాష్ నగర్, బుట్టిరాజారాంకాలని (ఓటర్లు 4,945), 26లో ఆదర్శనగర్, సుభాష్‌నగర్ (ఓటర్లు 5,027) ప్రాంతాలను చేర్చారు.

●డివిజన్ నం. 27లో శర్మనగర్, అంబేద్కర్ నగర్, కార్ఖానగడ్డ, గాంధీరోడ్ (ఓటర్లు 4,698)ను చేర్చారు.

● డివిజన్ నం. 28లో తీగలగుట్టపల్లి, కిసాన్‌నగర్ (ఓటర్లు 4,957), 29లో కిసాన్ నగర్ (ఓటర్లు 4,879), 30లో కిసాన్‌నగర్,

(మిగతా 8వ పేజీలో)

ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించేవారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించే వారిపై, అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం మోపాలన్నారు. సంబంధిత చట్టాలకనుగుణంగా నిందితులపై కేసులు నమోదు చేయాలన్నారు. చిట్‌ఫండ్ మోసాలు ఎక్కువగా నమోదు అవుతున్నందున వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి బాధితులకు న్యాయం చేయాలన్నారు. పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను సరైన పద్ధతిలో అమలు చేయాలని ఆదేశించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లను తరచూ సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. డివిజన్లవారీగా ఏసీపీ అధికారులు ప్రతి నెల నేర సమీక్షలు నిర్వహించాలన్నారు. సీసీసీ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతల సమస్యలను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వెంకటస్వామి, వి మాధవి, యాదగిరి స్వామి, శ్రీనివాస్, వేణుగోపాల్‌లతో పాటు కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

హాస్టల్‌కు వెళ్లమని మందలించిన తల్లిదండ్రులు

● పురుగుల మందు తాగిన విద్యార్థిని

● చికిత్స పొందుతూ మృతి



వైష్ణవి(ఫైల్)

గన్నేరువరం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీహాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కూన సంపతి-అనితదంపతులకు కుమారుడు సంజయ్, కుమార్తె వైష్ణవి(14) సంతానం. వీరువ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ పిల్లలను స్థానిక ప్రభుత్వపాఠశాలలో చదివిస్తున్నారు. కూతురు వైష్ణవి 8వ తరగతి చదివేందుకు ఈ సంవత్సరం ఇల్లంతకుంట మండలంలోని కేజీబీవీ పాఠశాలలో సీటు రావడంతో వైష్ణవిని హాస్టల్‌కు పంపించారు. హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి వైష్ణవి ఇష్టపడకపోవడంతో తండ్రి సంపత్ ఇటీవల కూతురికి నచ్చజెప్పి మళ్లీ పంపిస్తానని ఇంటికి తీసుకు వచ్చాడు. ఈనెల23న వైష్ణవిని హాస్టల్‌లో చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించి పొలం పనులకు వెళ్లిపోయారు. దీంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని వైష్ణవి ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు ఇంటికివచ్చేసరికి వైష్ణవి వాంతులు చేసుకుంటుండగా గమనించి వెంటనే కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైనవైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తండ్రి సంపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ రెడ్డి తెలిపారు.

బాలికను కుట్టిన తేలు

● చికిత్స పొందుతూ మృతి



మహోల(ఫైల్)

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తేలు కాటుకు గురైన ఓ బాలిక(8) చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కదురిక సరిత-రమేష్‌ల కూతురు మహోల రెండు కాళ్లపై ఈనెల 19న తేలు కాటు వేసింది. దీంతో మహోల తల్లి సరిత జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన వచ్చి రెండు ఇంజక్షన్లు ఇచ్చి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం మహోల అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా ఆర్ఎంపీ సంజీవ్‌కు సమాచారం అందించారు. అతడి సూచన మేరకు వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం చెందింది. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లే బాలిక మృతిచెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య



అజయ్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన బద్దిపడిగ విజయ-మల్లారెడ్డిలు అజయ్‌రెడ్డి(22)ని దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. అజయ్‌రెడ్డి కొంత కాలంగా మండలకేంద్రంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మల్లారెడ్డి ఆరేళ్ల క్రితం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కేంద్ర మంత్రిత్వ శాఖ దరఖాస్తుల ఆహ్వానం

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు



భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉపాధి మంత్రిత్వ శాఖ బీడీ కార్మి కుల కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. కార్మికుల పిల్లల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి ఉపకార వేత నాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం అందించే ఉప కార వేతనాల కోసం దరఖాస్తు చేసుకో వాలని కొత్తపల్లి బీడీ కార్మిక సంక్షేమ నిధి ఆస్పత్రి వైద్యులు సూచిస్తున్నారు.

● ప్రోత్సాహకం ఇలా..

1వతరగతి నుంచి నాలుగోతరగతి వరకు రూ.1000, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు రూ.1500, 9-10 తరగతులకు రూ.2 వేలు, ఇంటర్ రూ.3 వేలు, డిగ్రీ, ఐటీఐ, ఇ తర ప్రొఫెషనల్ కోర్సులకు రూ.6 వేలు, బీ టెక్, బీఎంఎస్ తదితర కోర్సులకు రూ.25 వేల ఉపకార వేతనాలు అందించను న్నారు.

● ఉపకార వేతనాలకు అర్హతలు

పీఎఫ్ ఐడీ కార్డు తప్పనిసరి. విద్యార్థుల పేరున బ్యాంక్ పాస్ బుక్ ఉండాలి. గతేడాది మార్కుల మెమో జత చేయాలి. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. నెలకు కనీసం రూ.10 వేల ఆదాయం మించి ఉండరాదు. కార్మికులకు ఇద్దరు పిల్లలు కలిగి ఉండి ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే విడి విడిగా వారి వారి పేర్లపై బ్యాంక్ అకౌంట్ తీయాలి. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నేరుగా ఉత్తీర్ణత సాధించిన వారే అర్హులు. సప్లిమెంటరీలో పాస్ అయిన వారు అనర్హులు. దూర విద్యనభ్యసించే వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

● దరఖాస్తుకు చివరి తేదీ

ఒకటి నుంచి పదోతరగతి చదివే విద్యార్థుల ఉపకార వేతనాల కోసం ఆగస్టు 31లోపు, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెసనల్ కోర్సుల విద్యార్థులు అక్టోబరు 31లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 040-25561297 నంబరులో సంప్రదించాలి.

సద్వినియోగం చేసుకోవాలి
- డాక్టర్ కె.అనుపరాణి,
బీడీ కార్మిక సంక్షేమ నిధి వైద్యురాలు, కొత్తపల్లి

ఉపకార వేతనాలకోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం అందించే చేయూతను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలి.

రామగుండం సీపీ అంబర్ కిశోర్‌కు ఉత్కృష్ట సేవా పతకం



సీపీ అంబర్ కిశోర్ ఝూ

కోల్‌సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూకు కేంద్ర ప్రభుత్వం ఉత్కృష్ట సేవా పతకాన్ని ప్రకటించింది. పోలీస్‌శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు కేంద్రం ఈ పథకాన్ని ఇస్తుంది. 2009 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అంబర్ కిశోర్ ఝూ వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం వృత్తిపరమైన నైపుణ్యంతో విధులు నిర్వర్తించినందుకు గాను ఈ పతకానికి ఎంపిక చేశారు. ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన సీపీ అంబర్ కిశోర్ ఝూను అధికారులు, సిబ్బంది అభినందించారు.

చోరీ కేసును చేధించిన పోలీసులు



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు వారంలోపే చేధించారు. చోరీకి పాల్పడిన తిరునహరి రాజనర్సింహస్వామి అనే దొంగను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. మంథనిలోని ఇల్లెందుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 22న హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 24న తిరిగి ఇంటికి రాగా ఇంట్లో చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా మంథనికి చెందిన తిరునహరి రాజనర్సింహస్వామిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. అతని నుంచి దొంగిలించిన వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసు చేధించిన ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ స్వామి, పీసీలు రమేష్, రాజ్‌కుమార్, శివ, అశోక్‌లను సీఐ రాజు అభినందించారు.

బాలిక మృతికి కారణమైన.. ఆర్ఎంపీ రిమాండ్



ఆర్ఎంపీని అరెస్టు చూపుతున్న ఏఎస్పీ చంద్రయ్య

చందుర్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలిక మృతికి కారణమైన ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ చంద్రయ్య తెలిపారు. తేలుకాటుకు గురైన బాలికకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్ఎంపీని చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ ఈనెల 19న కిష్టంపేట గ్రామానికి చెందిన మహోలకు తేలుకాటు వేసిందన్నారు. బాలికకు నిర్లక్ష్యంగా వైద్యం చేసి అపస్మారక స్థితిలోకి వెళ్లేందుకు కారకుడైన జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ సంజీవ్‌పై ఈనెల 25న బాలిక తల్లి సరిత చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. విచారణ జరిపి ఆర్ఎంపీపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి ఆర్ఎంపీ సంజీవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు



దొంగను అరెస్టు చూపుతున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో బంగారు నగలు అపహరించిన ఇద్దరు దొంగలను జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. నిందితుల వద్ద 3.6గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని పట్టణ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ధర్మపురి బైపాస్‌రోడ్‌లో పట్టణ పోలీసులు రాత్రి సమయంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సుమంత్‌తోపాటు ఓమైనర్ బాలుడు ఉన్నారు. విచారణలో వీరు జగిత్యాల పట్టణంలోని శ్రీరాంనగర్‌లో చాంద్‌బీ అనే వృద్ధురాలిపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న 3.6గ్రాముల బంగారు నగలు దోచుకువెళ్లినట్లు గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

బైక్ దొంగ అరెస్టు

మంథని, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బైక్‌చోరీ కేసులో మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామానికిచెందిన రత్నంరాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రాజు శనివారం తెలిపారు. తాడిచర్లలో హెచ్ఎంగా పనిచేస్తున్న చీర్ల తిరుపతిరెడ్డి ఈ నెల 27న స్థానిక పాతపెట్రోల్ పంపు వద్ద తన ఏపీ-15 ఏడీ7688బైక్‌ను పార్క్‌చేసి ఈనెల28న తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి బైక్ దొంగిలించిన రాజ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం దోపిడీకి గురైంది

● రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎలా అంటారు? ● కాళ్లేశ్వరం ప్రాజెక్టులో రూ. 80వేల కోట్లు కేసీఆర్ దోచాడు ● ఈ-కారు రేసులో రూ.49 కోట్లు బీఆర్ఎస్ పార్టీ ఫండ్‌కు.. ● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి 140సంవత్సరాల చరిత్ర ఉందని, కేటీఆర్ తాటాకు చప్పుళ్లకు భయపడేటోళ్లు లేరని అన్నారు. శనివారం రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మాజీప్రధాని పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీకార్యదర్శి గజ్జెల కాంతం, కాంగ్రెస్ నాయకులు పీవీ నర్సింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో గజ్జెలకాంతం మాట్లాడారు. 4కోట్లప్రజలు సంతోషంగా జీవిస్తారని సోనియాగాంధీ తెలం గాణ ఇస్తే పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభు త్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందని ఆరోపించారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో మాఫి యాలను తయారుచేసి కోట్లాది రూపాయలను అనుచరవర్గం సంపందించుకుందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలో 15లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని, కేసీఆర్ ముఖ్య మంత్రి అయ్యాక ఆ భూములను కబ్జాలు పెట్టి వేలకోట్లు ఆయన కుటుంబం సంపాదించుకుందని ఆరోపించారు. కేసీఆర్ వచ్చాకే తెలంగాణ ఉద్యమం మొదలు కాలేదని, 1969లో మొదలై అనేకమంది ఉద్యమాన్ని నడిపించారన్నారు. 2001లో భూ స్వాములతో కలిసి రాజకీయం, అధికారం కోసం పార్టీ పెట్టిన కేసీఆర్ నాడు కాంగ్రెస్, టీడీపీలో పొత్తు పెట్టుకున్నాడని, తెలంగాణ రాష్ట్రంకోసం పార్టీ పెట్టలేదని ఆరోపించారు.

తెలంగాణ జాతిపిత, బాపూజీ అంటే కొండా లక్ష్మణ్‌బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్‌ను అనాలన్నారు. రాష్ట్రాన్ని దోచినోడిని జాతిపిత, బాపూజీ అని ఎట్లా అంటారని ప్రశ్నించారు. ఉద్యమంలో శ్రీకాంతచారి చనిపోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కారణమని ఆరోపించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇష్టమొచ్చినట్లు కేటీఆర్ మాట్లాడితే చేతులు కట్టుకొని కూర్చుండబోమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ.70వేలకోట్ల ఖర్చుఉంటే కేసీఆర్ రూ.150వేల కోట్లకు కేసీఆర్‌పెంచి రూ.80వేల కోట్లు దోచాడని, కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్‌వేసి విచారణ జరుపు తోందన్నారు. ఈ-కారు రేసులో రూ.650కోట్లు కంపెనీలతో ఒప్పందం చేసుకొని రూ.49కోట్లు బీఆర్ఎస్ పార్టీఫండ్ కోసం తీసుకు న్నాడని ఆరోపించారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధానకార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశంగౌడ్, ఎండీఖాజా, ప్రధాన కార్య దర్శి వెంగళ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుమాల వెంకటేశం, కే రాజు, ఆడెపు జగన్, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్,వేముల రవి, రాగుల జగన్, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీడైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగులరాములు, నాయకులుబొప్ప దేవయ్య, ధర్మేం దర్, శివరాజ్, ఎండీ అహ్మద్, గోనె ఎల్లప్ప, రంగ కిషన్, బీమారం శ్రీనివాస్, బైరి ప్రభాకర్, బాస్కర్, గుజ్జె రమేష్ పాల్గొన్నారు.

ఇంటి నంబర్ కోసం ఏడాదిగా పాట్లు

● ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు

● ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల పట్టివేత



ఏసీబీకి పట్టుబడ్డ ఇద్దరు ఉద్యోగులు

సుల్తానాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్‌స్టాండ్ వెనుక ఇల్లు కట్టుకుని రెండేళ్లు అవుతోంది. ఇంటి నెంబర్ కోసం ఏడాదిగా తిరుగుతున్నా. రేపు మాపు అంటూ చివరకు పది వేలు లంచం ఇస్తేనే ఇంటి నెంబర్ కేటాయిస్తామన్నారు. అధికారుల తీరుపై విసిగి ఏసీబీ అధికారు లను ఆశ్రయించినట్లు బాధితుడు అర్నకొండ ప్రసాద్ తెలిపారు. సుల్తానాబాద్‌లోని పూసాల రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బిల్ కలెక్టర్ విజయ్ ఐదు వేల రూపాయలు బాధితుడు అర్నకొండ ప్రసాద్ నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని మున్సిపాలిటీ కార్యాలయానికి తీసుకు వచ్చి విచారిం చారు. ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ విజయ్ ఇద్దరు బాధితుడి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారించుకుని లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

వరకట్నం కోసం.. వేధిస్తున్న వ్యక్తిపై కేసు

మల్యాల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నూకపల్లికి చెందిన నులిగొండ అలియాస్ మరిశెట్టి సుప్రియకు జగిత్యాల మండలం జాబితాపూర్‌కు చెందిన గంగమహేశ్‌తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా కొన్నా ళ్లుగా సుప్రియను భర్త వరకట్నం కోసం వేధిస్తుండడంతో ఆమె మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు..

పట్టించుకోని అధికారులు



రాఘవాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయబావి

మానకొండూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి పక్కన వ్యవసాయబావి ప్రమాదకరంగా ఉంది. మానకొండూర్ నుంచి జమ్మికుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా వెడల్పు చేసి తారు రోడ్డును నిర్మించారు. అయితే మండల కేంద్రం నుంచి పచ్చునూర్ వరకు సుమారు 16కిలో మీటర్ల వరకు రోడ్డు వెంబడి సుమారు 10కి పైగా వ్యవసాయబావులు ఉన్నాయి. ఈ రోడ్డు వెంబడి ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఆటోలు, వందలాది ద్విచక్ర వాహనాలు నిత్యం నడుస్తుంటాయి. బావులు రోడ్డు పక్కన 20మీటర్ల లోతు వరకు ఉండి పూర్తి స్థాయిలో నీరు ఉండడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ బావుల వద్ద ఎలాంటి రక్షణ గోడ నిర్మించలేదు. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వ్యవసాయబావుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యవసాయ మోటార్ల దొంగతనం

జగిత్యాలరూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలఅర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధి గోపాల్‌రావుపేటలోని పెద్ద పులివాగు సమీపంలోని పొలాలవద్ద గల ఐదు వ్యవసాయ విద్యుత్‌మోటార్లను శుక్రవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు అత్తినేని గంగాధర్, రౌతు శేఖర్, దావ శంకర్, కొల్లూరి రవీందర్, అత్తినేని గంగన్న తెలిపారు. మోటార్లు లేకపోవడంతో నారుమడులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదనవ్యక్తం చేశారు. పోలీసులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పోలీసులు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తుండగా కొర్కల్ మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పదిట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎద్దుల దొంగలు పట్టివేత

వీణవంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన బావు రవికి చెందిన ఎద్దులను ఈ నెల19వ తేదీన దొంగలు వ్యవసాయపొలం నుంచి తోలుకుపోయారు. దీనిపై బావు రవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేకబృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తుచేశారు. శనివారం ఎద్దులను దొంగలించిన ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. తడిగొప్పుల అజయ్, మిడిదొడ్డి అభిలాష్‌తోపాటు బాలున్ని అరెస్టు చేశామన్నారు. ఎద్దులను పోలీసులు బాధితుడు రవికి అప్పగించారు.

పెట్రోల్ బంకుల్లో అక్రమాలు..

● ఆందోళనలకు దిగుతున్న వాహనదారులు

● పట్టించుకోని అధికారులు



ఆందోళన చేస్తున్న వాహనదారులు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు పెట్రోలు బంకుల్లో తూకాల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల లీటరు పెట్రోలు పోయించుకుంటే 900 నుంచి 950 ఎంఎల్ మాత్రమే వస్తోంది. బంకుల్లో ఇంధనం నిల్వ చేసే భూగర్భ ట్యాంకుల నిర్వహణ సక్రమంగా లేక నీరు కలుస్తోంది. తూకాల్లో వ్యత్యాసం, నీరు వస్తుండడం వల్ల వాహనదారులు ఆందోళనలకు దిగుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పెట్రోలులో వచ్చిన నీరు

● నిబంధనలు గాలికి..

మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, కోరుట్లపేట, అల్మాస్‌పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆయా సంస్థలకు సంబంధించిన డీజిల్, పెట్రోలు బంకులున్నాయి. ఏళ్లుగా నిర్వహణ లేకపోవడంతో బంకుల్లో పెట్రోలుతో పాటు నీళ్లూ వస్తున్నాయి. ఇటీవల వాహనదారులు బంకుల్లో ఆందోళనలకు దిగిన ఘటనలు ఉన్నాయి. మరోవైపు పెట్రోలు బంకుల్లో ఆటోమేటిక్ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో కొలతల్లో తేడా ఉండదని వాహనదారులు భావిస్తున్నారు. అయితే కొలతల్లో వ్యత్యాసం వచ్చేలా యజమానులు యంత్రాలను సరిచేస్తున్నట్లు తెలుస్తోంది. లీటరుకు 50 నుంచి 100 ఎంఎల్ తక్కువ వస్తోంది. కొందరు వాహనదారులు గుర్తించి యజమానులతో గొడవకు దిగడంతో సర్దిచెప్పి తప్పించుకుంటున్నారు. వాహనదారులు లీటర్ల చొప్పున కాకుండా డబ్బుల వారిగా పోయించుకోవడం బంకు యజమానులకు మరింత కలిసి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలను కోరుతున్నారు.

వాహనం చెడిపోతోంది..
- హబీబ్, వాహనదారుడు



బంకుల్లో పోయించుకున్న పెట్రోలు కల్తీ కావడం వల్ల వాహనం స్టార్ట్ కావడం లేదు. లీటరు పోయిస్తే తక్కువ వస్తోంది. పెట్రోలులో నీళ్ల వస్తున్నాయి. వాహనం చెడిపోతోంది. వాహనం రిపేరు చేయించుకోవాల్సిన పరిసితి వస్తోంది. అధికారులు బంకుల్లో తనిఖీలు చేయాలి.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ ఛైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి ఛైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వలేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్‌పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.

ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో పొగలు



బస్సు నుంచి పొగలు రాకుండా ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

భగత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్-2 డిపోలోని ఎలక్ట్రిక్ బస్సులో శనివారం పొగలు వ్యాపించాయి. జేబీఎం ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సు నంబరు టీఎస్ 02 టీ 1099 డిపోలో పార్క్ చేసింది. బస్సును తీసుకెళ్లేందుకు వచ్చిన డ్రైవర్ స్టార్ట్ చేయడంతో ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. గమనించిన డ్రైవర్ వెంటనే ఆర్టీస్టీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి విషయం చెప్పగానే ఫైర్‌సిబ్బంది వచ్చి ఆర్పి వేశారు. ఈ ఘటనలో ఎలాంటి నష్టమూ జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. కొత్తనీటితోపాటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఆరోగ్య సమస్యలూ పెరుగుతాయి. తాగునీటి కలుషితంతో జ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా వర్షం నీటి నిలువతో దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికున్‌గున్యా, స్వైన్ ఫ్లూకు సంబంధించిన వైరస్‌లు, బ్యాక్టీరియాల వ్యాప్తికి తోడ్పడడంతో జ్వరాలు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులు, జ్వరాలపై అవగాహన అవసరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

● చికున్‌గున్యా

చికున్ గున్యా వైరస్ కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఇది ప్రాణాతంకంకాని వైరల్ వ్యాధి అని వైద్యులు చెబుతున్నారు. చికున్‌గున్యా వచ్చిన వారిలో తలనొప్పి, కండరాల నొప్పి, కీళ్ల నొప్పులు అధికంగా ఉంటాయి.

● మలేరియా

ఈ కాలంలో మలేరియా వ్యాప్తి కూడా ఎక్కువే. మలేరియా జ్వరానికి కారణమయ్యే ప్లాస్మోడియం పరాన్నజీవి ఆడ అనాఫిలస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. చల్లని వాతావరణంతో ఫ్లూ వ్యాధి కూడా ఇబ్బంది పెడుతుంది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిపై ఇది వెంటనే దాడిచేస్తుంది. ముక్కు కారడం, జలుబు, దగ్గు, ఆయాసం ప్రధాన లక్షణాలు.

● టైఫాయిడ్

టైఫాయిడ్ అనేది కలుషిత ఆహారం, నీరు ద్వారా వ్యాపించే బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. నిరంతర జ్వరం, బలహీనత, కడుపునొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

● డెంగ్యూ

డెంగ్యూ జ్వరం వైరస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. నిలకడగా ఉన్న నీటిలో ఇవి సంతానోత్పత్తి చేస్తాయి. పాత డ్రమ్ములు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన నీటి తొట్టెల్లో ఈ దోమలు ఎక్కువగా ఉంటాయి. ఈ దోమలు కుట్టిన 7 నుంచి 8 రోజుల్లో హఠాత్తుగా జ్వరం రావడం, కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ప్లేట్‌లెట్స్ తగ్గి షాక్ సిండ్రోమ్‌కు దారి తీస్తుంది.

● ఇన్‌ఫ్లూయింజా(ఫ్లూ)

ఇన్‌ఫ్లూయింజా అనేది శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేసే వైరల్ ఇన్‌ఫెక్షన్. వర్షాకాలంలో ఇది ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. తేమతో కూడిన పరిస్థితుల కారణంగా ఇది సులభంగా వ్యాపిస్తుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



వర్షాకాలం వ్యాధులను కూడా మోసుకొస్తుంది. ఇందులో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటివి వ్యాపిస్తాయి. వీటి బారిన పడకుండా ఉండాలంటే ముందుగా ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా మురుగు నీరు, వర్షపు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త పడాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చెప్పే జాగ్రత్తలను పాటించాలి. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి. దోమ తెరలు, లిక్విడ్‌లు వాడాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా జాగ్రత్తపడాలి. పరిశుభ్రమైన నీరు, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఆరోగ్యసూత్రాలు పాటించేలా వారికి వివరించాలి.

అర్చక పోస్టుల భర్తీకి ఖాళీల వివరాల కోసం ఆదేశాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చకపోస్టుల భర్తీకి ఖాళీల వివరాలు పంపాలని రాష్ట్ర కమిషనరేట్ కార్యాలయం నుంచి జిల్లాల్లోని అధికారులకు శనివారం ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఉప ప్రధానార్చక, ముఖ్య అర్చక, అర్చక, పరిచారక పోస్టులను ఖాళీల ఆధారంగా త్వరలో భర్తీచేసేందుకు సన్నాహాలు ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 300పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లాలోని వేములవాడ,కొండగట్టు,ధర్మపురి ఆలయాల వివరాలు కమిషనరేట్ కార్యాలయంలో తెలియాల్సిఉండగా జిల్లాలో 6ఏ,బీ,సీ ఆలయాల్లో ఉపప్రధానార్చకుడు ఒక పోస్టుతో పాటు ముఖ్య అర్చకపోస్టులు ఏడుకు ఏడు భర్తీ అయిఉన్నాయి. అర్చక విభాగంలో 64పోస్టులుండగా 58మంది, పరిచారక విభాగంలో 28పోస్టులకు 23మంది విధులు నిర్వహిస్తున్నారు. అర్చక విభాగంలో 6, పరిచారక విభాగంలో 5చొప్పున ఈ రెండు విభాగాలు కలిపి 11పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరంఉందని సహాయ కమిషనర్ కార్యాలయం వెల్లడించారు. అసలేపోస్టులు మంజూరుకానివి, ప్రస్తుతం ఖాళీలు ప్రకటించినవి కలిపి సుమారు 51ఆలయాలున్నాయి. రాష్ట్ర కమిషనర్ తదుపరి ఆదేశాలమేరకు ఆలయాల పేర్లతో వివరాలు పూర్తిగా తెలుపవచ్చని, ప్రస్తుతం ఖాళీల వివరాలు పంపిస్తున్నామని ఉమ్మడి జిల్లా సహాయకమిషనర్ నాయిని సుప్రియ తెలిపారు.

వేతన వెతలు..

- మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- కుటుంబ పోషణకు ఇబ్బందులు



జాగీర్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

సైదాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం గ్రామాల్లో పారిశుధ్యం మొదలు.. నల్లానీరు, వీధిదీపాలు, పన్నులవసూళ్లు ఇలా అన్నిరకాల పనులుచేస్తూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచే గ్రామపంచాయతీ కార్మికులకు వేతన వెత తప్పడం లేదు. మూడునెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను ఒకే గొడుగు కిందకు తెచ్చి గతప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్లుగా జీవో తీసుకువచ్చింది. గ్రామ పంచాయతీలో పని చేసే వారు ఏ పనైనా చేయాలి. అందరికీ ఒకే వేతనం నిర్ణం యించింది. దీంతో గ్రామ పంచాయతీ వర్కర్లు మల్టీపర్పస్ వర్కర్లుగా కొనసాగుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామని, ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

సింగరేణి మెడికల్ కళాశాలలో 150 సీట్లకు అనుమతి

● ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్



సింగరేణి మెడికల్ కళాశాల

కళ్యాణ్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నిర్వహణలో లోపం ఉండడంతో జాతీయ వైద్య విద్య కమిషన్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అనుమతికి అభ్యంతరాలు తెలిపింది. ఈ ఏడాది సింగరేణి మెడికల్ కళాశాల 4వ సంవత్సరంలో అడుగు పెట్టనున్నది. కళాశాలల లోపాలపై రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, డీఎంఈతో పాటు వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాల్స్‌ను, డీన్‌లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, ప్రిన్సిపాల్ డీన్‌లతో చర్చించిన ఎన్ఎంసీ సింగరేణి మెడికల్ కళాశాలతో పాటు మిగతా 25కళాశాలలకు 150ఎంబీబీఎస్ సీట్లకు అనుమతిని ఇస్తున్నట్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 26కళాశాలల్లో అసౌకర్యాలు ఉండడం, కొన్ని కళాశాలలు గోడౌన్‌లలో నిర్వహించడం, విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడం, వసతి గృహాలు లేకపోవడం, బోధన సిబ్బంది లేకపోవడంతో ఎన్ఎంసీ తీవ్ర అభ్యంతరం చెప్పింది. దీనిపై రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి, వైద్యవిద్య సంచాలకులు, ప్రిన్సిపాల్స్ డీన్‌లు అసౌక ర్యాలపై నివేదిక ఇవ్వడంతో శనివారం 150సీట్ల నిర్వహణపై అనుమతులు ఇచ్చింది.

2న ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపికకు ప్రిలిమినరీగా గోదావరిఖని, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లలో జూలై 2న మహిళా ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో ఉమ్మడిజిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొ న్నారు. ఉమ్మడిజిల్లా జట్టు ఎంపికకు ముందుగా 60మంది మహిళా క్రికెటర్లను ఎంపిక చేసి వారిని నాలుగు జట్లుగా విభజించి రౌండ్ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ చాటే క్రీడాకారులను ఉమ్మడిజిల్లా మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. ఆయాప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని జూలై 2నఉదయం 8గంటలకు మైదానాల్లో కోచ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు కరీంనగర్‌లో శ్రవణ్(కేడీసీఏ ఆఫీస్ నెట్స్) 8688768775, గోదావరిఖనిలో కిరణ్‌కుమార్(జీఎంఆఫీస్ గ్రౌండ్) 9866351620, జగిత్యాలలో జలపతి (వివేకానంద స్టేడియం) 9948064712, సిరిసిల్లలో మనోహర్ (రైజింగ్ స్పోర్ట్స్ అకాడమీ)ను 8497979747 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

● అవీఇవీ..

గణేశ్‌నగర్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి 11 వరకు సీతారాంపూర్, సాయి బాలజీ నగర్, జగిత్యాల రోడ్డు, ఆర్టీసీ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపి వేయ నున్నట్లు రూరల్ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

- మండలంలోని కన్నాపూర్ పంచాయతీ పరిధిలోని కిష్కిందపల్లెలో గణేష్ మండపం ముందు నుంచి తన ఇంట్లోకి వెళ్లడానికి ఓ వ్యక్తి ఉద్దేశపూర్వకంగా గేటు నిర్మిస్తున్నాడని కిష్కిందపల్లి ప్రజలు ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు శనివారం ఫిర్యాదు చేశారు.

చొప్పదండి: చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వేణును సీపీ గౌస్ ఆలం అభినందించారు. వృత్తిలో ప్రతిభ కనిపించినందుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జూలై 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 3వ ఆల్ ఇండియా జూనియర్ చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు.

కరీంనగర్ క్రైం: కమిషనరేట్ పరిధిలో పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులను సీపీ గౌస్ ఆలం సన్మానించారు.

భగత్‌నగర్: బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటయ్యాయని ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఇందిరా గార్డెన్స్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళా శాలలో శనివారం నేషనల్ స్టాటిస్టిక్స్ డేను నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌కు చెందిన త్రిదండి కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి వార్షిక పరమపదోత్సవములు ఆది, సోమ, మంగళవారాల్లో నీరుకుళ్ల మానేటి రంగ నాయకస్వామి దేవస్థానం, బృందావనం వద్ద నిర్వహించనున్నట్లు స్వామీజీ పూర్వాశ్రమ కుమారుడు ఆచార్య రామకృష్ణ, శ్రీవైష్ణవ సంఘం బాధ్యులు తెలిపారు.

దేశాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ



పీవీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ఆర్థిక కష్టాల నుంచి గటెక్కించిన మేధావి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధివైపు నడిపించారన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ రాహుల్, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన చైర్మన్ మడుపు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవలు మరువ లేనివని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. క్యాంపు కార్యాలయంలో పీవీ చిత్రపటం వద్ద నివాళుల ర్పించారు

హుజూరాబాద్: పట్టణంలోని సైదాపూర్ క్రాస్‌రోడ్‌లో పీవీ సేవాసమితి, అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ప్రధానకూడలిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్దికుమార్ ఆధ్వర్యంలో పీవీకి నివాళుల ర్పించారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పీవీ జయంతి నిర్వహించారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని రత్న లాడ్జిలో పామ రాజు రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన పీవీ జయంతికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు హాజరయ్యారు. కరాటే మాస్టర్ సంపత్‌కుమార్, పీవీ సాహిత్య పీఠం కన్వీనర్ సంతోష్‌బాబు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ : నగరంలో రైతు ప్రజా సంఘాల కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న జీవీ రామకృష్ణారావు

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం



జర్నలిస్టులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం బైపాస్ రోడ్డులోని జర్నలిస్టుల కాలనీకి రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు దాదాపు ఐదెకరాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. మల్కాపూర్ శివారులో జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని కూడా అభివృద్ధి చేస్తామని, అక్కడ సమస్యలేమైనా ఉంటే సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. టీయూడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోని అక్రమాలను బయటపెడతా

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలను బయటపెడతానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఎల్ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో తిమ్మాపూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పదేళ్ల అధికారం కట్టబెడితే ఆట పాటలతోనే కాలం గడిపిన రసమయి పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు కట్టించిన పాపాన పోలేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బండారి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో నూతనంగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. . అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.

వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే వన మహోత్సవానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ సోమవారం ప్రజల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులతో పాటు నగరపాలక సంస్థ పౌరసేవా కేంద్ర దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల వారీగా ఎవరి వద్ద దరకాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు.వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి టెండర్లు పూర్తి చేయాలని కోరారు. బ్లాక్ ప్లాంటేషన్ పద్ధతిలో మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించాలన్నారు.

బంధువుల నుంచి చట్టబద్ధమైన దత్తత

కరీంనగర్ క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన రెండు కుటుంబాల్లో పిల్లలు లేనివారు వారి బంధువులు, రక్తసంబంధీకుల నుంచి శనివారం చట్టబద్ధమైన దత్తత తీసుకున్నారు. కలెక్టర్ పమేలా సత్పతి కార్యాలయంలో దత్తత ఉత్తర్వులను తల్లిదండ్రులకు అందజేశారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, ఎల్‌సీపీవో రాజు పాల్గొన్నారు.

ఆలయంలో వనమహోత్సవం

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవంలో భాగంగా నగరంలోని జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం వనమహోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో నాగారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, పూల మొక్కలు నాటారు.

ఉయలలో 15 నెలల శిశువు

సుభాష్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఊయల(క్రెడిట్ బేబి రిసెప్షన్ సెంటర్)లో శనివారం 15 నెలల వయస్సు ఉన్న మగ శిశువును వదిలి వెళ్లినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. బాబుకు ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ విభాగానికి సమాచారం ఇచ్చారు. డీసీపీయూ సిబ్బంది శిశువును కరీంనగర్ శిశు గృహానికి తీసుకెళ్లారు. డీసీపీవో పర్వీన్, శిశు గృహ మేనేజర్ తేజస్వీ పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో గోరింటాకు సంబరాలు



గోరింటాకు చూపిస్తున్న విద్యార్థినులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం సందర్భంగా నగరంలోని అల్ఫోర్స్ బాలికల ఇ-టెక్నో పాఠశాలలో శనివారం గోరింటాకు సంబరాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి గోరింటాకు విశిష్టతను వివరిం చారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● బ్లూబెల్స్‌లో...

హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ పాఠశాలలో గోరింటాకు వేడుకలను ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహర రెడ్డి ప్రారంభించారు. గోరింటాకు గొప్పతనాన్ని వివరించారు.

‘మొలాటు’ పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం ఫిలింభవన్‌లో రచయిత కూకట్ల తిరుపతి రచించిన ‘మొలాటు’ పుస్తకాన్ని బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు తమ ఊరి భాష అయిన జీవ భాసలో రచనలు చేయాలని, ప్రామాణిక భాషను ప్రయోజనకరంగా బద్దలు చేసేది అసలు సిసలైన కవిత్వ భాష అని అన్నారు. కందుకూరి అంజయ్య పుస్తక పరిచయం చేశారు. అతిథులు వెంకటేశ్వర్లు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

పారమిత వరల్డ్‌లో శుభారంభ్

కరీంనగర్ కల్చరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్లో శనివారం శుభారంభ్ ఉత్సవం పేరుతో విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు వేడుకను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, వీయూఎం ప్రసాద్, అనూకర్‌రావు, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీకర్ పాల్గొన్నారు.

●సంక్షిప్త సమాచారం

గణేశ్‌నగర్: జూలై 9వ తేదీన చేపట్టనున్న సమ్మెను కరీంనగర్ ఆర్టిజన్ కార్మికులు విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఎన్‌పీడీసీఎల్ కార్యాలయం ఆవరణలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

గణేశ్‌నగర్: ప్రైవేటు విద్యాసంస్థలో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రకటనలో డిమాండ్ చేశారు.

గణేశ్‌నగర్: రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల అమలు తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్య గౌడ్ కోరారు.

సుభాష్‌నగర్: అఖిలభారత యాదవ మహాసభ జాతీయ కౌన్సిల్ మెంబర్ సందమహేంద్రయాదవ్ జన్మదిన వేడుకలను దివ్యాంగులు, వృద్ధాశ్రమంలో నిర్వహించారు.

గణేశ్‌నగర్: తెలంగాణ స్టెప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంపై చొరవ చూపాలని తెలంగాణ యువజన సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేల సత్పతికి వినతి పత్రం అందజేశారు.

గంగాధర/రామడుగు: గంగాధర మండలంలోని మధురానగర్ సురభి పాఠశాలలో, రామడుగు మండల కేంద్రంలో బ్రిలియంట్ మోడల్‌స్కూల్‌లో మెహందీ నిర్వహించారు.

రామడుగు: హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా తెలంగాణ జిల్లాల మహిళా అధ్యక్షురాళ్లకు నిర్వహించిన సమావేశంలో గోపాల్‌రావుపేట మాజీసర్పంచ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న పాల్గొన్నారు.

తిమ్మాపూర్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యక్రమాలను అడ్డుకుంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రసమయి బాలకిషన్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు.

శ్రీపురం కాలనీలో సమస్యల తిష్ఠ



వీధిలో పేరుకపోయిన చెత్తకుప్ప

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నగర శివారులోని శ్రీపురం కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే వీధిలో నాలుగైదు చోట్ల చెత్తకుప్పలు పేరుకుపోయాయి. తడి, పొడి చెత్త బండి వస్తున్నా చెత్తాచెదారం, కుప్పలు తీసుకెళ్లే ట్రాక్టర్ రెండు నెలలుగా రావడం లేదు. ఇటీవల కాలనీని కార్పొరేషన్‌లో విలీనం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నపుడు నెల రోజులకు ఒకసారైనా ట్రాక్టర్ వచ్చేది. మొన్నటి వరకు ఎండాకాలం కావడంతో చెత్త ఎండి గాలి దుమారానికి ఎక్కడపడితే అక్కడ పడింది. ప్రస్తుతం వర్షాకాలం రావడంతో వర్షాలకు ఆ చెత్తపై దోమలు, ఈగలు చేరి ఇళ్ల లోపలికి వస్తున్నాయి. కుక్కలు, పందులు చెత్తను తోడేస్తున్నాయి. బ్లీచింగ్ పౌడర్, దోమల మందు చల్లడం లేదు. రోజు విడిచి రోజు వస్తున్న మున్సిపల్ నల్లా కూడా కొద్ది సేపటికే బంద్ అవుతోంది. బావులు, బోర్లలో నీళ్ల లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ కోతలతో కాలనీవాసులు సతమతమవుతున్నారు. గాలిదుమారం, వర్షం లేకున్నా, పలుమార్లు కరెంట్ సరఫరా కట్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో పిల్లలు చదువు కోవడానికి, వృద్ధులు దారి వెంట నడవడానికి ఇబ్బం దిగా మారుతోంది. మున్సిపల్ కమిషనర్ స్పందిం చాలని, సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పునర్విభజన ప్రక్రియలో కాంగ్రెస్ జోక్యం కోలేదు

కరీంనగర్ అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వార్డుల పునర్విభజన ప్రక్రియలో కాంగ్రెస్ జోక్యం చేసుకోలేదని, మతం పేరుతో, కులం పేరుతో లబ్ధిపొందాలని కుటిల రాజకీయాలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్యని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిన్నటి వరకు కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ ఒక్క రూపాయి తేలేదన్న వ్యక్తి ఈ రోజు బండి సంజయ్ అభివృద్ధి ప్రదాత అని మాట్లాడడం చూస్తే ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని ఎద్దేవా చేశారు. అధికారులు అందరి వినతులను పరిగణలోకి తీసుకొని ప్రక్రియ పారదర్శకంగా చేపట్టారన్నారు. నాయకులు శ్రవణ్ నాయక్, రమేష్, దన్నాసింగ్ పాల్గొన్నారు.

ఎంఐఎంకు అనుకూలంగా డివిజన్ల పునర్విభజన

భగత్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పునర్విభజనను కుట్రపూరితంగా ఎంఐఎంకు అనుకూలంగా చేశారని మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగర పాలక సంస్థ పునర్విభజనలో అధికారులు ఒత్తిళ్లకు లోనయినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. 16 డివిజన్లను ఎంఐఎంకు అనుకూలంగా చేయడంలో ఎవరి కుట్ర ఉందో బహిర్గతమవుతుందన్నారు. డివిజన్ల పునర్విభజ ప్రక్రియలో ఏ అధికారి ఏ నాయకుడిని కలిశారో సాక్షాలతో బయటపెట్టడానికి వెనుకాడ బోమన్నారు. ఎంఐఎంకు నగర పాలకసంస్థను కట్టబెట్టే కుట్రలో భాగంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకమన్నారు. ధర్మంవైపు నిలబడే ప్రతీ పౌరుడు బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు.

సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి తెస్తాం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో సెంట్రల్‌లైటింగ్ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ మహేష్, అధికారులు పాల్గొన్నారు.

మండలంలోని దేశాయిపేటకు చెందిన మహిళాసంఘం సభ్యురాలు కట్టెకోళ్ల సౌమ్య మృతి చెందగా ఆమె తల్లికి పది లక్షల రూపాయల బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

గంగాధర: మండలంలోని మధురానగర్‌కు చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కూతురు చికిత్సకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు.

నేడు హోమియోపతి డాక్టర్ల రాష్ట్ర సదస్సు

సుభాష్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ రాష్ట్ర సదస్సును కరీంనగర్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పద్మనగర్‌లోని ప్రకృతి బ్యాంక్వెట్ హాల్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9.30కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు.

మారిన డివిజన్ల స్వరూపం

(5వ పేజీ తరువాయి)

ఖాన్‌పుర, దుర్గమ్మగడ్డ, కార్ఖానగడ్డ, గాంధీరోడ్ (ఓటర్లు 5,448), 31లో ఖాన్‌పుర, దుర్గమ్మగడ్డ (ఓటర్లు 5,364), 32లో హుస్సేనిపుర (ఓటర్లు 5,273), 33లో హుస్సేనిపుర (ఓటర్లు 5,050), 34లో కృష్ణానగర్, మధురానగర్, విజయనగర్‌కాలనీ, సలాఫినగర్, హుస్సేనిపుర (ఓటర్లు 5,059) ప్రాంత్రాలు ఉన్నాయి.

● డివిజన్ నం. 35లో కాపువాడ, మారుతినగర్, హుస్సేనిపుర (ఓటర్లు 4,765), 36లో కాపువాడ, మారుతినగర్ (ఓటర్లు 5,195), 37లో షాహెబ్‌స్ట్రీట్ (ఓటర్లు 5,417), 38లో గాయత్రినగర్, అమీర్‌నగర్, లక్ష్మీనగర్ (ఓటర్లు 4,849) ప్రాంతాలను చేర్చారు.

● డివిజన్ నం. 39లో కోతిరాంపూర్, అలకాపురికాలనీ (ఓటర్లు 4,744), 40లో కట్టరాంపూర్, తిరుమలనగర్, గణేశ్‌నగర్, కోతిరాంపూర్, హనుమాన్ నగర్ (ఓటర్లు 4,903), 41లో కట్టరాంపూర్, గౌతమినగర్, భగత్‌నగర్ (ఓటర్లు 4,851), 42లో భగత్‌నగర్ (ఓటర్లు 5,239), వార్డ్ నెం-43 భగత్‌నగర్, గోదాంగడ్డ, శ్రీనగర్‌కాలని (ఓటర్లు 5,344) ప్రాంతాలు ఉన్నాయి.

● డివిజన్ నం. 44లో శ్రీనగర్‌కాలనీ, సప్తగిరికాలనీ (ఓటర్లు 5,392), 45లో మంకమ్మతోట (ఓటర్లు 5,043), 46లో ప్రగతినగర్, రాంనగర్ (ఓటర్లు 4,968), 47లో మంకమ్మతోట, రాంనగర్, సంతోష్‌నగర్ (ఓటర్లు 5,225), 48లో రాంనగర్, సంతోష్‌నగర్, విద్యానగర్ (ఓటర్లు 5,110) ప్రాంతాలను చేర్చారు. డివిజన్ నం. 49లో జ్యోతినగర్, రాంనగర్, సంతోష్‌నగర్ (ఓటర్లు 4,789), డివిజన్ నం. 50లో జ్యోతినగర్, చైతన్యపురి, భాగ్యనగర్ (ఓటర్లు 5,193) ప్రాంతాలు ఉన్నాయి.

● డివిజన్ నం. 51లో వావిలాలపల్లి (ఓటర్లు 5,102), 52లో డాక్టర్స్ స్ట్రీట్, వావిలాలపల్లి (ఓటర్లు 5,442) ప్రాంతాలను చేర్చారు.

● డివిజన్ నం. 53లో కార్ఖానగడ్డ, గాంధీరోడ్, శర్మనగర్, సహేత్‌నగర్ (ఓటర్లు 4,826), 54లో అశోక్‌నగర్, కార్ఖానగడ్డ, గాంధీరోడ్ (ఓటర్లు 5,034), 55లో కాపువాడ, మారుతినగర్ (ఓటర్లు 5,055) ప్రాంతాలు ఉన్నాయి.

● డివిజనం నం. 56లో షాహెబ్‌స్ట్రీట్, సిక్‌వాడి, బోయవాడ (ఓటర్లు 5,028), 57లో దోబివాడ, గంజ్‌ఏరియా, మార్కెట్‌ఏరియా, గణేశ్‌నగర్, తిరుమలనగర్, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్ (ఓటర్లు 4,772), 58లో సిక్‌వాడి, బోయవాడ, లక్ష్మీనగర్, గణేశ్‌నగర్, ముఖరంపుర, స్టేడియంరోడ్ (ఓటర్లు 4,987) ప్రాంతాలను చేర్చారు.

● డివిజనం నం. 59లో ముకరంపుర (ఓటర్లు 4,711), 60లో మంకమ్మతోట, కాశ్మీర్‌గడ్డ, రైతుబజార్, ఉమెన్స్ కాలేజీ, ఫైర్‌స్టేషన్ ఏరియా, గోదాంగడ్డ, ముఖరంపుర (ఓటర్లు 5,236) ప్రాంతాలు ఉన్నాయి.

● డివిజనం నం. 61లో మంకమ్మతోట (ఓటర్లు 5,595), 62లో మంకమ్మతోట (ఓటర్లు 4,927), 63లో జ్యోతినగర్ (ఓటర్లు 5,044), 64 లో ముఖరంపుర, జ్యోతినగర్ (ఓటర్లు 4,754), 65లో డాక్టర్స్ స్ట్రీట్, హజ్మత్‌పుర, ఆదర్శనగర్, సుభాష్‌నగర్, కార్ఖానగడ్డ, గాంధీరోడ్ (ఓటర్లు 5,156), 66లో టవర్‌సర్కిల్, తిలక్‌నగర్, శాస్త్రిరోడ్, వీక్లీ మార్కెట్ (ఓటర్లు 5,276) ప్రాంతాలను చేర్చారు.

వివేకానంద విద్యానికేతన్‌లో ‘ఆశీర్వచన్’ 2025

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్‌లో శనివారం ‘ఆశీర్వచన్’-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తల్లిదండ్రులకు 10వ తరగతి విద్యార్థులు పాదపూజ చేసి ఆశీస్సులందుకున్నారు. పండితుడు మహేశ్వర శర్మ, విద్యాసంస్థ చైర్మన్ సౌగాని కొమురయ్య, ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి పాల్గొన్నారు.

ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో బజాజ్ సర్వ్ కోర్సు

కరీంనగర్ రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు రుబికాన్ ఫౌండేషన్ బజాజ్ ఫిన్ సర్వ్ నిర్వహిస్తున్న (సీపీబీఎఫ్ఐ) కోర్సును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్య సాధనకు ప్రత్యేక కోర్సులు దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్రసింగ్, ఏవో రాజశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, ఎంబీఏ విభాగపు అధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హుజూరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హుజూరాబాద్ సీనియర్ సివిల్‌జడ్జి పీబీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయరావు ఆధ్వర్యంలో నిషేధిత మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ యువతకు మంచి భవిష్యత్ ఉందన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

భగత్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జూలై 3, 4 తేదీల్లో ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో 48 గంటల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

గణేశ్‌నగర్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉమ్మడి జిల్లా సమావేశంలో మాట్లాడారు.

స్మార్ట్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, స్మార్ట్ ఫోన్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ అన్నారు. నగరంలోని విద్యానగర్‌లోని గ్లోబల్ రత్నం ప్రైవేట్ పాఠశాలలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ చైల్డ్ హెల్ప్‌లైన్, షీ టీం, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా అవగా హన సదస్సు నిర్వహించారు.

మున్సిపల్ జవాన్ల అరాచకాలను అరికట్టాలి

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థలో మున్సిపల్ కార్మికులపై జవాన్ల అరచకాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌టీయూ అనుబంధ కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్టర్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల వద్ద నుంచి జవాన్లు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే వేధిస్తున్నారని ఆరోపించారు.

దరఖాస్తుదారుడిపై దురుసుగా ప్రవర్తించిన కార్యదర్శి

ఇల్లందకుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సమాచారం హక్కు చట్టం ద్వారా జీపీ వివరాలు అడిగిన తనపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించినట్లు మండలంలోని సిరిసేడుకు చెందిన అనిల్ తెలిపాడు. ఇల్లందకుంటకు చెందిన అభివృద్ధి నిధుల వివరాలతో కూడిన సమాచారం కోసం ఇల్లందకుంట కార్యదర్శికి ఆర్టీఐ ద్వారా దరఖాస్తు అందించినట్లు, రిసీవ్ కాపీ అడగగా దురుసుగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు, మంత్రులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గడ్డిమందును నిషేధించాలి

సుభాష్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పారా క్వాట్ హెర్బిసైడ్ (గడ్డిమందు)పై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని హెల్త్‌కేర్ రిఫార్మ్ డాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. శనివారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బండారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంఐఎంకు అనుకూలంగా పునర్విభజన చేయలేదు

కరీంనగర్ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డివిజన్ల పునర్విభజన ఎంఐఎంకు అనుకూలంగా చేయలేదని నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ ప్రకటనలో తెలిపారు. విభజనలో పొరపాట్లు లేవని పేర్కొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 9వ డివిజన్ పరిధిలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు.డివిజన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

అనుమతిలేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

భగత్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సందగణేష్, అల్లపు అభిలాష్, గుంటుక నైనేష్ పాల్గొన్నారు.